సాక్షి
అనకాపల్లి

ఆదివారం । 10 । మార్చి । 2024



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలేశునికి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.



పోటెత్తిన భక్తులు

విశాఖ: పూర్ణామార్కెట్ సమీపంలోని దుర్గాలమ్మ వార్షిక జాతర కు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.



చీఫ్ వార్డెన్ నియామకం

విశాఖ: అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా ఏయూ ఫార్మసీ కాలేజ్ ప్రొఫెసర్ ఈశ్వర్‌కుమార్ నియమితులయ్యారు.

న్యూస్‌రీల్

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నాల్గవ యూనిట్‌లో సాంకేతిక సమస్య కారణంగా గురువారం సాయంత్రం నిలిచిపోయిన విద్యుదుత్పత్తిని శనివారం ఉదయం పునరుద్ధరించారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాల్గవ యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు లీకేజీ ఏర్పడిన కారణంగా గురువారం సాయంత్రం విద్యుదుత్పత్తిని అధికారులు నిలిపివేశారు. సమస్యను గుర్తించిన సాంకేతిక నిపుణులు యుద్ధప్రాతిపదికన రిపేర్లను పూర్తి చేసి శనివారం ఉదయం 8.30 గంటలకు విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్ల ద్వారా పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి జరుగుతుందని ఎన్టీపీసీ అధికారవర్గాలు వెల్లడించాయి.

పారా మిలటరీ దళాల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పారా మిలటరీ, పోలీస్ దళాలు

చోడవరం రూరల్: రానున్న ఎన్నికల దృష్ట్యా చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కేటాయించిన సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్సు (పారా మిలటరీ దళాలు) శనివారం పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించింది. ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి పోలీస్, పారా మిలటరీ దళ సిబ్బంది సంయుక్తంగా ఇక్కడ పలు వీధుల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తులో భాగంగా ప్రస్తుతానికి వంద మంది పారా మిలటరీ సిబ్బంది చేరుకున్నారని, తదనంతర అవసరాల రీత్యా వీరి సంఖ్యను ఎన్నికల సంఘం పెంచే అవకాశం ఉందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. చోడవరానికి కేటాయించిన పారా మిలటరీ కంపెనీకి అనకాపల్లి డీఎస్పీ పలు సూచనలు చేశారు. చోడవరం ఎస్ఐ సూర్యనారాయణ, ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్సు ఆర్ఐ పాల్గొన్నారు.

ఆర్జేడీగా విజయభాస్కర్ బాధ్యతల స్వీకరణ



ఆర్జేడీ విజయభాస్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనందరెడ్డి

విశాఖ విద్య: విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ)గా బి.విజయభాస్కర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని సమగ్ర శిక్ష ఎస్పీడీ కార్యాలయంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా(ఎస్ఏఎంఓ)గా పనిచేస్తున్న విజయభాస్కర్‌ను విశాఖ ఆర్జేడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన ఆర్జేడీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ ఆనంద్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు ఆధ్వర్యంలో సంఘం జిల్లా నాయకులు ఆర్జేడీని కలసి అభినందించారు.

13 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

మద్దిలపాలెం (విశాఖ) : డాక్టర్.వి.ఎస్.కృష్ణా కళాశాలలోని డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సైన్స్ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ క్లాసులు, ప్రాక్టికల్ పరీక్షలను ఈనెల 13వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని అధ్యాయన కేంద్రం కో ఆర్డినేటర్ జి.రాజుకుమార్ తెలిపారు. దీనికి సంబంధించి వివరాలను విద్యార్థులకు పోస్టు ద్వారా పంపించామన్నారు. మరిన్ని వివరాలకు అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ఆధ్యాత్మిక వైభవం..
భక్త జన సందోహం



రావికమతం: కల్యాణపులోవలో శనివారం భక్తుల పుణ్యస్నానాలు



నర్సీపట్నం: బలిఘట్టం ఉత్తరవాహినిలో స్నానాలు చేస్తున్న భక్తులు

- శివరాత్రి జాగరణ అనంతరం పెద్ద సంఖ్యలో భక్తుల పుణ్యస్నానాలు

రావికమతం/చోడవరం: మహాశివరాత్రి తెల్లవార్లూ దైవధ్యానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో జాగారం చేసిన భక్తులు శనివారం ఉదయం నదులు, చెరువుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణపులోవ తిరునాళ్లకు రెండో రోజూ భక్తులు, యాత్రికులు పోటెత్తారు. స్నానాల రేవులో బ్రాహ్మణులచే బ్రహ్మముడులు వేయించుకుని దంపతులు పుణ్యస్నానాలాచరించారు. ఆపై పోతురాజుబాబు, పెద్దింటమ్మ తల్లి ఆలయాల్లో ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం రెట్టింపు స్థాయిలో యాత్రికులు తరలిరావడంతో ప్రమాదాల నివారణకు కొత్తకోట సీఐ అప్పలనాయుడు ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు వన్‌వే ప్రవేశపెట్టారు. బస్సులు, కార్లు మినహా బైక్‌లకు తిరుగు ప్రయాణం రూట్‌ను రిజర్వాయర్ కాలువ గట్టు రోడ్డుకు మళ్లించి అటు టి.అర్జాపురం, దొండపూడి ఫారెస్ట్ ఠాణా వద్ద బీఎన్ రోడ్డు ఎక్కేలా మళ్లించారు. శనివారం కూడా వేలాదిమందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 22 కౌంటర్ల ద్వారా భోజన వసతి కల్పించారు. వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు నిర్విరామంగా సేవలందించారు. పోతురాజుబాబు ఆలయం వద్ద తోటకూరపాలెం భక్త భజన బృందం మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 102 భజన పాటలకు కోలాటం నిర్వహించారు.



చోడవరం: స్వయంభూ గౌరీశ్వరస్వామివారి శివరాత్రి రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

వైభవంగా స్వయంభూ గౌరీశ్వరస్వామి రథయాత్ర

చోడవరం మండలం ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద శారదానదిలో వేలాది మంది భక్తులు శనివారం తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించారు. పెద్దేరు, బొడ్డేరు, శారద నదుల సంగమం వద్ద అతి పురాతన దేవాలయంలో కొలువైన సంగమేశ్వరస్వామిని దర్శించుకొని తరించారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవకాలంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పులివాహనంపై ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

52 అంగన్‌వాడీలకు ఆట వస్తువుల పంపిణీ

అనకాపల్లి : జిల్లాలో 52 అంగన్‌వాడీ భవనాలకు ఆట వస్తువులు సమకూర్చినట్టు ఎంపీ బి.వి.సత్యవతి చెప్పారు. వెంకుపాలెం గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని ఆమె శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక వైద్యురాలిగా మానసిక ఉల్లాసం కోసం ఆటలు తప్పనిసరి అని భావించి జిల్లాలో 52 అంగన్వాడీ కేంద్రాలకు రూ.42 వేల చొప్పున ఆట వస్తువులు మంజూరు చేశామన్నారు. అంతకుముందు గర్భిణులకు సీమంతాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ గొర్ల సూరిబాబు ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి పాల్గొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం ఎంపీ బి.వి. సత్యవతి శారదానది ఒడ్డున గల ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



వెంకుపాలెం గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి

యారాడ తీరంలో బాలుడిని రక్షించిన లైఫ్‌గార్డ్స్



లైఫ్ గార్డ్స్ రక్షించిన బాలుడు

పెదగంట్యాడ: విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలానికి చెందిన కుమార్ (12) తల్లిదండ్రులతో కలసి యారాడ తీరంలో శనివారం స్నానం చేస్తుండగా అలల తాకిడికి ఒక్కసారిగా కొట్టుపోసాగాడు. అక్కడే ఉన్న జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ గమనించి, సముద్రంలోకి దూకి బాలుడిని రక్షించారు.

బీచ్ శుభ్రం.. మరింత భద్రం



విశాఖ పాండురంగాపురం బీచ్ వద్ద పరిశుభ్రంగా ఇలా..

- సాగరతీరంలో పరిశుభ్రత, భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం
- తీరప్రాంతాల శుభ్రతకు బీచ్‌టెక్ 2000 ఎస్ యంత్రాల వినియోగం
- సందర్శకులను ప్రాణాలు కాపాడేందుకు అందుబాటులో 38 మంది లైఫ్‌గార్డ్స్

డాబాగార్డెన్స్: విశాఖపట్నం.. దేశంలోనే ప్రధాన పర్యాటక ఆకర్షణ గల నగరం. విశాఖ పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది బీచ్. ఎటూ చూసిన నీలివర్ణంలో కనిపించే సముద్ర అందాలు చూపరులను ఎంతగానో ఆకర్షిస్తాయి. సముద్రం తీరం నగరానికి ఆనుకుని ఉండటంతో సాయంత్రం కాగానే జనం అలా బీచ్ వైపు అడుగేస్తారు. వేడి వేడి రుచులను ఆరగిస్తూ.. చల్లని గాలిని ఆస్వాదిస్తారు. విదేశీ పర్యాటకులు సైతం విశాఖలోని బీచ్‌లకు మంత్రముగ్ధులవుతున్నారు. ఇటీవల ఆర్.కె.బీచ్‌ను సందర్శించిన ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ స్టీవ్ హార్మిసన్.. ఇక్కడి అందాలకు ఫిదా అయ్యారు. భారత్‌లో తాను చూసిన బీచ్‌ల్లో ఆర్.కె.బీచ్ అత్యంత శుభ్రమైనదని కితాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సాగరతీర పరిశుభ్రతపై చేపట్టిన చర్యలతో ఇది సాధ్యమైంది. మునుపెన్నడూ లేని విధంగా తీర ప్రాంతాలు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. తీరంలో భద్రతకు సైతం ప్రాధాన్యమిచ్చి.. 38 మంది లైఫ్‌గార్డ్స్‌ను నియమించింది. ఏడాది కాలంలో వీరు దాదాపు 115 మందిని ప్రాణాలతో రక్షించారు.

6 ప్రత్యేక వాహనాలతో క్లీనింగ్

'ఎకో వైజాగ్'లో భాగంగా బీచ్ టెక్ 2000 ఎస్ యంత్రాలను జీవీఎంసీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఐదు వాహనాలను మూడేళ్ల పాటు రూ.9.98 కోట్లకు లీజు తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.82 లక్షలతో మరో వాహనాన్ని సొంతంగా సమకూర్చుకుంది. బీచ్ క్లీనింగ్ పేరిట ఈ ఆరు వాహనాలు రుషికొండ, ఆర్.కె.బీచ్, భీమిలి తదితర బీచ్‌ల్లో నిత్యం తిరుగుతూ వ్యర్థాలను తొలగిస్తూ.. బీచ్‌లను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నాయి.

115 మందిని కాపాడిన లైఫ్‌గార్డ్స్

సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించడానికి జీవీఎంసీ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. వివిధ రాష్ట్రాల నుంచి విశాఖ బీచ్ అందాలు చూసేందుకు వచ్చే పర్యాటకులు.. సరదాగా బీచ్‌లో స్నానానికి దిగి గల్లంతైన సంఘటనలు కోకొల్లాలు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ పటిష్ట చర్యలు చేపట్టింది. సురక్షితమైన బీచ్‌గా తీర్చిదిద్దేందుకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగానే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ స్పోర్ట్స్ సహకారంతో 38 మంది సముద్రపు ఈతగాళ్లను ఎంపిక చేశారు. భీమిలి బీచ్‌లో నలుగురు, రుషికొండ బీచ్‌లో ఆరుగురు, సాగర్‌నగర్ బీచ్‌లో నలుగురు, జోడుగుళ్లపాలెం బీచ్‌లో నలుగురు, లుంబినీపార్క్ బీచ్‌లో నలుగురు, పెదజాలరిపేట డిపో ఏరియాలో నలుగురు, ఆర్కే బీచ్ వద్ద ఎనిమిది మంది, కోస్టల్ బ్యాటరీ ఏరియాలో నలుగురు షిఫ్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారు. ఏడాది కాలంలో సముద్రంలో ప్రమాదవశాత్తూ మునిగిపోయి వారు, ఆత్మహత్యకు ప్రయత్నించిన దాదాపు 115 మందిని ప్రాణాలతో రక్షించి తీరానికి తీసుకొచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



బీచ్‌లో గల్లంతైన వారిని వెతుకుతున్న రోబో(ఫైల్)



అందుబాటులోకి రోబోలు.. అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

ఇక సస్యశ్యామలమే..

- రూ.84.40 కోట్లతో పెద్దేరు జలాశయం ఆధునికీకరణకు శ్రీకారం
- 4 ఎల్ కాలువకు అదనంగా రూ.9.12 కోట్ల మంజూరు
- నేడు డిప్యూటీ సీఎం బూడి శంకుస్థాపన
- ఆయకట్టులో 19,969 ఎకరాలకు తీరనున్న సాగునీటి సమస్య
- వైఎస్సార్ ఆశయాన్ని నెరవేర్చుతున్న సీఎం జగన్

మాడుగుల: పెద్దేరు (తెన్నేటి విశ్వనాథం) జలాశయ ఆయకట్టు భూములు ఇక సస్యశ్యామలం కానున్నాయి. మూడు మండలాల రైతుల సాగునీటి కష్టాలు తీరనున్నాయి. 9,969 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. మహానేత వైఎస్సార్ ఎంతో ఘనంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాన పంట కాలువల అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా విస్మరించారు. దాంతో పూర్తిస్థాయిలో సాగునీరందక రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ నేపథ్యంలో రిజర్వాయరు ఆధునికీరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.84.40 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తం పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. మాడుగుల, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో 90 శాతం మంది రైతులకు వ్యవసాయమే జీవనాధారం కావడంతో వర్షాలు అనుకూలించక, పంటలు పండక వలసలు పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 20 ఏళ్ల క్రితం మాడుగుల మండలం రావిపాలెం వద్ద పెద్దేరు నదిపై రూ.38 కోట్లతో జలాశయం నిర్మించారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2006లో ప్రారంభించి జాతికి అంకితం చేశారు. రైతులు కోరిక మేరకు శివారు ఆయకట్టుకు సాగునీరు అందాలంటే సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆనాడే ఆదేశించారు. ఆ తర్వాత ఆయన మరణంతో ఆ పనులు నేటికీ పూర్తి కాలేదు. దీని ఆయకట్టు 19,969 ఎకరాలు కాగా సగం భూములకు సాగునీరందలేదు.


వైఎస్సార్‌సీపీ పాలనలో కదలిక..

జలాశయం ప్రధాన ఆర్ఎంసీ కాలువ 19 కిలోమీటర్ల వరకు, రాచకట్టు కాలువ 10.04 కిలోమీటర్ల మేర సీసీ లైనింగ్‌తోపాటు చిన్నచిన్న మదుంలు, గట్టు పటిష్ట పనులు చేయాల్సి ఉంది. వీటిని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పాలనలో పలుమార్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు దృష్టికి డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు తీసుకెళ్లారు. దాంతో రూ.84.40 కోట్లు మంజూరయ్యాయి.

గొటివాడ బ్రాంచి కెనాల్‌కు మోక్షం: పెద్దేరు ఆయకట్టులో భాగంగా గొటివాడ బ్రాంచి కెనాల్ 25 ఏళ్ల క్రితం నిర్మించారు. ఎడమ, కుడి కాలువల పరిధిలో 2,900 ఎకరాల మెట్ట భూములున్నాయి. శివారు ఆయకట్టుకు సాగునీరందక పొలాలు బీడుగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో సీసీ లైనింగ్ ఏర్పాటు చేస్తే, ఈ భూములు సస్యశ్యామలం కానున్నాయి. రెండు కాలువలకు 9 కిలోమీటర్ల మేర సీసీ లైనింగ్ ఏర్పాటు చేయనున్నారు.

ఫోర్ ఎల్.కాలువకు..

పెద్దేరు ఆయకట్టు పరిధిలో ఎల్. గవరవరం, కామకూటం, ఓండ్రువీధి, ఎల్. కృష్ణాపురంతో పాటు మరో నాలుగు గిరిజన గ్రామాలకు సాగు నీరందలేదు. 2006లో జలాశయం ప్రారంభోత్సవంలో వైఎస్సార్‌కు 8 గిరిజన గ్రామాల రైతులు తమకు సాగు నీరందించాలని కోరారు. అప్పట్లోనే ఫోర్ ఎల్. కాలువ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులు నేటి వరకు జరగలేదు. గిరి రైతుల కష్టాలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అదనంగా రూ.9.12 కోట్లు మంజూరు చేయించారు. దీంతో 842 ఎకరాల మెట్టు భూమి సస్యశ్యామలం కానుందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పెద్దేరు జలాశయం



సీసీ లైనింగ్ చేపట్టాల్సిన రాచకట్టు ప్రధాన కాలువ



సీసీ లైనింగ్ ఏర్పాటు చేయనున్న ఆర్ఎంసీ ప్రధాన పంట కాలువ

మిగిలిన జలాశయాలను ఆధునికీకరిస్తాం



ప్రతి నీటి బొట్టు పొలాలకు చేర్చి మాడుగుల నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే జీవిత ఆశయంగా పెట్టుకున్నాను. రానున్న కాలంలో మిగిలిన జలాశయాలను ఆధునికీకరిస్తాను. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తొలుత పెద్దేరు ఆధునికీకరణకు రూ.84.40 కోట్లు మంజూరయ్యాయి. ఈ జాలాశయం పరిధిలో పూర్తి గిరిజన ప్రాంత ఆయకట్టులో 4ఎల్ చానల్ నిర్మాణానికి మరో రూ.9.12 కోట్లు మంజూరు చేయించాం.

– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

మా కల నెరవేరుతుంది



2006లో జలాశయ ప్రారంభోత్సవానికి వచ్చిన మహానేత వైఎస్సార్‌ను నేను స్వయంగా కలసి ఆయకట్టు పరిధిలో 8 గ్రామాలకు చెందిన 847 ఎకరాల మెట్ట భూములకు సాగు నీరందించాలని కోరాను. ఆయన వెంటనే అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత నేటి వరకు పనులు చేయలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పాలనలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా నిధులు మంజూరు కావడంతో మా కల నెరవేరబోతుంది.

– ఓండ్రు దేవాలు, గిరిజన రైతు, ఎల్.పొన్నవోలు, మాడుగుల మండలం

క్లుప్తంగా

రేపు మినీ జాబ్ మేళా

అనకాపల్లి : యలమంచిలి ఎస్‌జీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11 తేదీన అచ్యుతాపురం టీజే కంపెనీ ప్రతినిధులు మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న జరిగే ఇంటర్వ్యూలకు 7వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసించి ఉండాలని, వయస్సు 18 నుండి 35 సంవత్సరాల్లోపు నిరుద్యోగులు జాబ్‌మేళాకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8142565416 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

జూలో మరో రెండు నల్ల హంస పిల్లలు



జూ కొలనులో తల్లి హంసతో తిరుగుతున్న పిల్లలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూపార్కులో నల్ల హంస మరో రెండు పిల్లల్ని పొదిగింది. దీంతో జూలో వాటి సంఖ్య 12కి చేరింది. రెండు పిల్లల్ని తల్లి హంసతో పాటు జూ కొలనులో వారం రోజులు నుంచి విడిచిపెడుతున్నారు. సుమారు ఎనిమిదేళ్ల క్రితం ఇక్కడకు ఒక జత ఆస్ట్రేలియన్ నల్ల హంసలను జూ అధికారులు తీసుకొచ్చారు. అవి ఇంతవరకు నాలుగు విడతలలో పిల్లలను పొదగడంతో వాటి సంఖ్య 12కు చేరింది. గత ఏడాది ఇక్కడ ఓ నల్ల హంస నాలుగు పిల్లల్ని పొదిగిన విషయం తెలిసిందే.

ఐదున్నర టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- రేషన్ డీలర్ భర్తపై 6ఎ కేసు నమోదు
- రేషన్ డిపోలో సరిపోయిన స్టాక్
- బయట కొన్న బియ్యంగా గుర్తించిన అధికారులు



గున్నెంపూడిలో రేషన్ డిపో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బుచ్చెయ్యపేట : మండలం గున్నెంపూడిలో ఓ ఇంట్లో బయటకు తరలించడానికి నిల్వచేసిన ఐదున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. స్థానికుల సమాచారం మేరకు శనివారం విజిలెన్స్ సీఐ తిరుపతిరావు, ఎస్ఐ రవి, సీఎస్‌డీటీ ఈశ్వరరావు తమ సిబ్బందితో గున్నెంపూడిలో సోదాలు చేశారు. రేషన్ డిపోకు దగ్గరలో ఒక ఇంట్లో నిల్వ చేసి తరలించడానికి సిద్ధం చేసిన 111 బస్తాలు రేషన్ బియ్యం గుర్తించారు. గున్నెంపూడి రేషన్ డీలర్ ముమ్మిడిశెట్టి సునీత భర్త రమేష్ ఈ బియ్యాన్ని నిల్వ చేసినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. పట్టుకున్న బియ్యాన్ని రావికమతం ప్రభుత్వ రేషన్ గుడౌన్‌కు తరలించి లెక్కించగా 5,650 కేజీలుగా గుర్తించారు. గున్నెంపూడి రేషన్‌డిపోను తెరిపించి రికార్డులను, అక్కడ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. ల్వాలు,రికార్డులు సరిపోవడంతో ఎక్కడ నుండి రేషన్ బియ్యం తీసుకొచ్చింది విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. దీంతో పలువురు వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసినట్టు రేషన్ డీలర్ భర్త రమేష్ అధికారులకు తెలిపారు. దీనిపై రమేష్‌పై ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినందుకు 6ఎ కేసుతో పాటు అతనిపై చట్టపమైన చర్యలు తీసుకునేందుకు 7(1) కేసు నమెదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గతంలో కూడా అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినందుకు 6ఎ కేసు నమోదు చేయగా, ఇపుడు రెండోసారి కూడా రైషన్ బియ్యం అక్రమ నిల్వపై అధికారులు కేసు నమోదు చేశారు.

బతిమాలుతూ.. బెదిరిస్తూ..

- చింతకాయల విజయ్ అవాకులూ చవాకులు



మాట్లాడుతున్న చింతకాయల విజయ్

నాతవరం: అయ్యన్నకు ఇవే చివరి ఎన్నికలు, ఓటేసి గెలిపించండని ఒకపక్క బతిమాలుతూ.. అధికారంలోకి వస్తే అంతు చూస్తామని మరోపక్క బెదిరిస్తూ.. చింతకాయల విజయ్ చేసిన ప్రసంగం చర్చనీయాంశమైంది. నాతవరంలో శనివారం రాత్రి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా విజయ్ మాట్లాడుతూ.. 'మేము త్వరలోనే అధికారంలోకి వస్తాం.. మీ సంగతి చూస్తాం.. మిమ్మల్ని రక్షించే వాడెవడూ ఉండడు' అంటూ బెదిరింపులకు దిగారు. మిమ్మల్ని కాపాడే దిక్కెవరూ ఉండరని హెచ్చరించారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తన హయాంలోనే నాతవరం పంచాయతీని అభివృద్ధి చేశానన్నారు. చివరి ఎన్నికలని బతిమాలుతున్న చింతకాయల విజయ్.. మరోపక్క మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ బెదిరింపు ధోరణిలో మాట్లాడడం విమర్శలపాలైంది.

జూడో క్రీడాకారిణికి దాతల సాయం



క్రీడాకారిణి కీర్తికి రూ.10 వేలు అందిస్తున్న భీమిలి సన్ స్కూల్ ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్టకు చెందిన జూడో క్రీడాకారిణి పాలెపు కీర్తికి పలువురు దాతలు శనివారం ఆర్థికసాయం అందించి ప్రోత్సహించారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు న్యూఢిల్లీలో కె.డి జాదవ్ ఇండోర్ స్టేడియంలోని ఐజీ కాంప్లెక్స్‌లో జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగనున్న జాతీయస్థాయి జూడో పోటీలకు కీర్తి హాజరవుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పోటీల్లో పాల్గొనేందుకు గానూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆమె గురించి 'జూడోలో కీర్తి పతాక'శీర్షికతో 'సాక్షి'కథనం ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన భీమిలి సన్ స్కూల్ చైర్మన్ కై తపల్లి శ్రీనివాస్ రూ.10 వేలు సాయం చేశారు. ఈ మొత్తాన్ని వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ చేతుల మీదుగా కీర్తికి అందించారు. సంతపేట అంకిత ఫ్యాషన్స్ యజమాని పేర్ల రాజేష్ రూ.1000, చిట్టివలస ఇండియన్ పేట్రియాట్స్ గ్రూప్ తరపున రూ.7వేలు, పెద్దిపాలేనికి చెందిన మరో దాత రూ.5 వేలు అందించారు. దీంతో ఆమె ఆదివారం న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు.

నాణేల సేకరణకర్త నేమాని మృతి

- ఆర్.వై. అగ్రహారంలో విషాద ఛాయలు



నేమాని వెంకటేశ్వరశర్మ(ఫైల్)

కె.కోటపాడు: మండలంలోని ఆర్.వై. అగ్రహారానికి చెందిన రిటైర్డ్ షిప్‌యార్డ్ ఉద్యోగి, పురాతన నాణేలు, విదేశీ కరెన్సీ నోట్ల సేకరణకర్త నేమాని వెంకటేశ్వరశర్మ(75) శనివారం మృతి చెందారు. ఉద్యోగ విరమణ అనంతరం పురాతన నాణేలు, విదేశీ కరెన్సీ నోట్లను ఆయన సేకరిస్తూ పాఠశాలల్లో ప్రదర్శించి వాటి విశిష్టతను విద్యార్థులకు వివరించేవారు. ఏటా గ్రంథాలయ వారోత్సవాల్లో వీటిని ప్రదర్శించేవారు. గ్రామంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఎనిమిదేళ్లుగా ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, తదితర విద్యా సామగ్రిని అందిస్తుండేవారు. సామాజిక బాధ్యతతో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ మన్ననలను పొందుతుండేవారు. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నేమాని భౌతికకాయాన్ని పలువురు దర్శించుకుని ఘన నివాళులర్పించారు. మృతునికి భార్య కాశీబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సన్ షేడ్ కూలి బామ్మ, మనవడికి గాయాలు



కూలిన ఇంటి సన్‌షేడ్



గాయపడిన వరలక్ష్మి, సోహన్ రవికుమార్‌బాబు

ఎస్.రాయవరం : వెంకటాపురం గ్రామంలో శనివారం ఇంటి సన్ షేడ్ స్లాబ్ కూలి బామ్మ, మనవడుకు గాయాలయ్యాయి. శనివారం ఉదయం మరిశా విజయ్‌కుమార్‌కు చెందిన ఇంటి సన్ షేడ్ ప్రమాద వశాత్తూ కూలడంతో 60 ఏళ్ల పైబడిన వయస్సు గల మరిశా వరలక్ష్మి, ఐదేళ్ల వయస్సు గల మరిశా సోహన్ రవికుమార్‌బాబుకు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే తుని ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అంతర్జాతీయ హిందీ సదస్సుకు ఇక్బాల్



ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం హిందీ విభాగం పూర్వ ఆచార్యులు, విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎం.ఎస్ ఇక్బాల్‌కి కజకిస్తాన్‌లో జరిగే అంతర్జాతీయ హిందీ సమ్మేళనానికి భారత ప్రభుత్వం తరపున ఆహ్వానం అందింది. కజికిస్తాన్‌లోని ఫరాబి కజఖ్ జాతీయ విశ్వవిద్యాలయం, వివేకానంద సాంస్కృతిక కేంద్రం, భారత ఎంబసీ సంయుక్తంగా యూరేషియా, భారత్‌లో హిందీ వర్తమానం, భవిష్యత్తు అంశంపై సదస్సును నిర్వహిస్తోంది. మార్చి 13–14 తేదీలలో హిందీ భాష, సాహిత్యాలపై అల్మటీ యూనివర్సిటీలో అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో విభిన్న దేశాలకు చెందిన హిందీ భాష నిపుణులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆచార్య ఇక్బాల్ హిందీ భాష వికాసంలో చారిత్రాత్మక సంఘటనలు అనే అంశంపై తమ ప్రసంగ పత్రాన్ని సమర్పిస్తారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న కోటిపల్లి జేజిబాబు

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ఉన్న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి 30వ ఆరాధనతోపాటు మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణాన్ని శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వద్ద నిర్వహించిన భారీ అన్నసమారాధనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ల సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షుడు కోసూరి మన్మధరావు, అధ్యక్షులు వానపల్లి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి మునాసనరామకృష్ణ, పట్టణ కామాక్షి కార్పెంటర్ల సంఘం సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పకు ఘనంగా పూజలు


అయ్యప్ప ఆలయంలో 18 మెట్లపై ఏర్పాటు చేసిన శివలింగాలు

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్వామివారికి అభిషేకాలు, హోమాలు జరిగాయి. 18 మెట్ల పైన అమర్చిన 18 శివలింగాలకు భక్తులు స్వయంగా అభిషేకం చేసుకునే వెసులుబాటును ఆలయ కమిటీ సభ్యులు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కటకం లక్ష్మణరావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉప్పల శ్రీనివాసరావు, తాడికొండ సతీష్, కొండలరావు, కొల్లూరు మురళి, విన్నకోట పేర్రాజు, టి.శ్రీకాంత్ మణికంఠ, గ్రంధి రవికుమార్, మద్దుల రామ్‌కుమార్, కొరుపోలు గోపీ, జిల్లేడు ప్రకాష్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 5,879 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,780	4,150
మొదటి రకం	3,600	4,280
రెండో రకం	3,410	3,770
మూడోరకం	3,300	3,470

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:రాజా
గామి	:సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	:సత్యనారాయణస్క్రీన్-2
రాజుగారి అమ్మాయి, నాయుడుగారి అబ్బాయి	: షిర్డీసాయి
ఊరు పేరు భైరవకోన	:పర్తిసాయి
ఆపరేషన్ వాలెంటైన్	:వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	:శ్రీసత్య
భీమా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-13 యూనిట్లు, బి పాజిటివ్-45 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ 9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 317 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రగతి పరవళ్లు

- అభివృద్ధి పథంలో కోడూరు
- రూపురేఖలు మారిన గ్రామం


జగనన్న గృహం ముందు లబ్ధిదారుడు

అనకాపల్లి: గత ప్రభుత్వం హయాంలో తీవ్ర నిరాదరణకు గురై, కనీస స్థాయిలో కూడా అభివృద్ధికి నోచుకోని మండలంలోని కోడూరు గ్రామం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన ఐదేళ్లలో ప్రగతి పథంలో పరుగులుతీస్తోంది. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అనకాపల్లి, సబ్బవరం మండలాల సరిహద్దులో ఉన్న ఈ గ్రామాన్ని గతంలో ఎవరూ పట్టించుకోలేదు. దీర్ఘకాలికంగా పరిష్కారంకాని సమస్యలెన్నో ఇప్పుడు పరిష్కారమయ్యాయి. పలు సంక్షేమ పథకాలతో గ్రామస్తులు లబ్ధిపొందారు.ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు ప్రభుత్వ బడి ప్రస్తుతం కార్పొరేట్ హంగులతో చూడముచ్చట గొలుపుతున్నాయి. తమ గ్రామంలోనే వైద్య సేవలు, మందులు, పలు రకాల పరీక్షలు ఉచితంగా అందుతుండడంతో వైద్యం కోసం పట్టణాలకు వెళ్లవలసిన బాధ తప్పిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామంలోనే పూర్తిస్థాయిలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో పింఛన్ల కోసం గంటల తరబడి ఎండలో నిలుచోవలసి వచ్చేదని, ఇప్పుడు వలంటీర్లు తెల్లవారక ముందే ఇంటి వద్దే పింఛన్లు అందజేస్తున్నారని పలువురు వృద్ధులు తెలిపారు. కోడూరు సచివాలయ పరిధిలో రూ.16.29 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు నిర్వహించారు.


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఊరు మారింది...

ఉద్యోగరిత్యా పొరుగూళ్లలో ఉన్న వారు ఇటీవల పండగ సందర్భంగా ఇక్కడి వచ్చి, గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయారు. ఇదీ మా గ్రామమేనా అనే సందేహం వారికి కలిగింది. గ్రామంలో సీసీరోడ్లు, ఎక్కడికక్కడ డ్రైనేజీలు, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతారం వారిని ఆనందపరవశులను చేసింది.

గ్రామం దాటే పనిలేదు....



గతంలో ఏపనికై నా పట్టణానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం గ్రామంలోనే సమస్తం సమకూర్చింది. అన్ని పనులు గ్రామంలోనే పూర్తి చేసుకోగలుగుతున్నాం. సంక్షేమ పథకాల నిధులు మొత్తం నా బ్యాంకు ఖాతాలో జమ అవతున్నాయి. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు చేరడం ఆనందంగా ఉంది. ఐదేళ్లలో మా గ్రామం ఇంతగా అభివృద్ధి చెందుతుందని ఊహించుకోలేదు.

– సోమిరెడ్డి సన్యాసమ్మ, కోడూరు

గ్రామ రూపురేఖలు మారాయి



గ్రామం రూపురేఖలు పూర్తిగా మారాయి. ఎన్నడూ చూడని విధంగా అభివృద్ధి జరిగింది. గత ప్రభుత్వాలు ఏ నాడు గ్రామాభివృద్ధిపై దృష్టి సారించలేదు. ప్రస్తుత ప్రభుత్వం సీసీరోడ్ల నిర్మాణంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించింది.

– కోసిరెడ్డి పెంటారావు, కోడూరు




500 లీటర్ల సామర్థ్యం గల వాటర్‌ట్యాంకు


గ్రామంలో నూతన రహదారి


గ్రామ సచివాలయంలో సేవలందిస్తున్న ఉద్యోగులు

గ్రామంలో అమలైన సంక్షేమం, అభివృద్ధి పథకాల వివరాలు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందిన నగదు రూ.లలో
జగనన్న అమ్మఒడి	278	1,30,49,950
జనగన్న విద్యాదీవెన	202	48,85,839
జగనన్న వసతిదీవెన	157	23,18,882
వైఎస్సార్ రైతుభరోసా	394	1,88,68,500
వైఎస్సార్ ఉచిత పంటలబీమా	18	9,483
వైఎస్సార్‌రైతు సున్నావడ్డీ	32	69,408
రైతులకు ఇన్‌పుట్‌సబ్సిడీ	42	1,32,883
వైఎస్సార్ పింఛన్ కానుక	373	3,77,41,250
వైఎస్సార్ చేయూత	191	83,62,500
వైఎస్సార్ ఆసరా	517	1,51,99,783
వైఎస్సార్ సున్నావడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	584	11,58,291
వైఎస్సార్‌కాపునేస్తం	2	300
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	2	30,000
వైఎస్సార్ కల్యాణమస్తు షాదీతోఫా	1	50,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	111	32,05,524
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	70	3,87,275
సింగిల్‌లబ్ధిదారులకు నేరుగా చెల్లింపు	72	72,82,299
వైఎస్సార్ బీమా	7	9,60,000
వైఎస్సార్ వాహనమిత్ర	41	12,30,000
వైఎస్సార్ చేదోడు	22	5,50,000
కోవిడ్ సమయంలో సహాయం	651	6,51,000
జగనన్న తోడు(వడ్డీ)	72	35,525

పరోక్ష ప్రయోజనాలు (నాన్ బీబీటీ)

ఇళ్లస్థలాలు	95	రూ.2,33,70,000
జగనన్నవిద్యాకానుక	129	రూ.9,16,158
8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు	19	రూ.2,51,218
జగనన్న తోడు (రుణాలు)	102	రూ.18,99,138
జగనన్న గోరుముద్ద	143	రూ.14,16,701
వైఎస్సార్‌సంపూర్ణ పోషణ	150	రూ.28,09,500
ఇంటింటికీ రేషన్	693	రూ.1,51,37,92

అభివృద్ధి పనులు

నాడు-నేడు పాఠశాలలు	రూ.1,00,69,000
గడప గడపకు మన ప్రభుత్వం	రూ.20,00,000
గ్రామ సచివాలయ కార్యాలయాలు	రూ.43,60,000
విలేజ్ హెల్త్‌క్లినిక్	రూ.21,00,000
రైతుభరోసా కేంద్రం	రూ.23,94,000
సీసీరోడ్లు	రూ.35,00,000
కాలువలు	రూ.20,00,000

ఘనంగా శూలాల మహోత్సవం


లింగోద్భవ పూజల అనంతరం అలంకరణలో శివలింగం


శూలాలు ధరించి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కశింకోట: మహాశివరాత్రి సందర్భంగా మండల కేంద్రం కశింకోటలో శుక్రవారం రాత్రి సాంబ శివుని శూలాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు కూడా శూలాలు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. స్థానిక కుమ్మరి వీధిలో గల సాంబశివుని ఆలయం నుంచి సుమారు 15 మంది భక్తులు గంప శూలాలు, సాంబ శివుని శూలం, బుగ్గ శూలాలు ధరించి డప్పులు, ప్రభలతో ఊరేగింపు ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రధాన వీధుల మీదుగా ఉత్సవ ఊరేగింపు సాగింది. ఉమా,సాంబ శివుని ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సాంబశివుని ఆలయం వరకు ఊరేగింపు జరిగింది. మహాశివరాత్రి ఉత్సవంలో భాగంగా స్థానిక శివాలయంలో అర్ధరాత్రి లింగోద్భవ పూజలను అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించి శివ లింగాన్ని అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పోటీపడి స్వామిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు సహకారంతో నేపాల్ నుంచి రప్పించిన వేలాది రుద్రాక్షలతో రుద్రాభిషేకం జరిపారు. రుద్రాక్షలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.


కశింకోట శివాలయంలో నిర్వహిస్తున్న లింగోద్భవ పూజలు

వైభవంగా శివరాత్రి పూజలు


తోడపెద్దుసేవ


ఏకాహంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: గౌరీ పంచాయతన దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారికి ఆభరణాలతో అలంకరించి, రాత్రి నుంచి ఉదయం వరకు ః పంచాక్షరి నామంతో అర్ధ ఏకాహం నిర్వహించారు. తోడపెద్ద సేవ భక్తులను ఆకట్టుకుంది. స్వామివారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ పంచాయతన దేవస్థానం అధ్యక్షులు కె.సన్యాసినాయుడు, కార్యదర్శి బోడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, గీతా మహిళా మండలి, సత్తెమ్మతల్లి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

67 మందికి ఉచిత వైద్య సేవలు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం శివాలయం వద్ద శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, 67 మందికి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష రోగులకు ఉచితంగా ఆయుర్వేదిక్ మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులు, ఆయుర్వేదిక్ వైద్యం పట్ల అవగాహన కల్పించారు.

ఆయుర్వేదం భారతీయ వైద్యమని, దీనిలో దాదాపు అన్ని రకాల రుగ్మతలకు మందులు ఉన్నాయన్నారు. స్థానిక ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కేదారేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


విసన్నపేట పడమటమ్మలోవలో నిర్వహిస్తున్నహోమం

కశింకోట: మండలంలోని విసన్నపేట గ్రామం వద్ద ప్రసిద్ధి చెందిన పడమటమ్మ లోవలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి కేదారేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గురువు పి. సాంబమూర్తి ఆధ్వర్యంలో విశ్వశాంతి, వ్యక్తిగత శాంతి, ఆలయ అభివృద్ధి కోరుతూ హోమం నిర్వహించారు. దీపార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు

అనకాపల్లి: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కె.సుజాత చెప్పారు. లెక్కలు, జువాలజీ, హిస్టరీ పరీక్షలను జనరల్ విద్యార్థులు 11,488 మందికిగాను 11,096 మంది రాయగా 352 మంది గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు. ఒకేషనల్ పరీక్షలను 2,864 మందికిగాను 2,674 మంది రాయగా 190 మంది గైర్హాజరైనట్టు ఆమె చెప్పారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

కోటవురట్ల : మహాశివరాత్రి జాగరణ చేసిన భక్తులతో ఆలయాలు పోటెత్తాయి. సమీప వరాహనదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసి ఉపవాస దీక్షలను విరమించారు. మండల కేంద్రంలోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, కైలాసపట్నంలోని శ్రీరాజగోపాలస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వాలీబాల్ పోటీల విజేత గాజువాక జట్టు


ప్రథమస్థానంలో నిలిచిన గాజువాక జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు


జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు గోవింద్‌ను సత్కరిస్తున్న రఘునాథ్

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని గాజువాక, ద్వితీయ స్థానాన్ని ఆదిరెడ్డిపాలెం జట్లు సాధించాయి. మూడు, నాలుగు స్థానాల్లో అనకాపల్లి, గుల్లేపల్లి జట్లు నిలిచాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15000, ద్వితీయ బహుమతిగా రూ.10,000, తృతీయ బహుమతిగా రూ.6000, నాలుగో బహుమతిగా రూ.4000లను నిర్వాహకులు ఎల్లపు గోవింద, బుద్ధ శివ, పీలా రమణరావు, భీమరశెట్టి లక్ష్మీనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు గోవింద్‌ను అనకాపల్లి వాలీబాల్ అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరీ వ్యాయామశాల అధ్యక్షుడు కొణతాల అప్పలనాయుడు, క్రీడాకారులకు వ్యక్తిగత బహుమతులను అందజేశారు. కాంద్రేగుల జగన్నాథరావు, జార్జ్‌క్లబ్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, పోటీల నిర్వహకులు విల్లూరి ప్రసాద్, పెంటకోట చిన్న, దాడి ఈశ్వరరావు, భీశెట్టి శ్రీనివాసరావు, రాపేటి సీతారాం, రిఫరీలు మోహన్‌రావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్


పోటీలకు హాజరైన మహిళలు

కశింకోట: స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాల వద్ద మహా శివరాత్రి పురస్కరించుకుని మహిళలకు నిర్వహించిన రంగవల్లుల పోటీలో కంచిపాటి జ్యోష్న ప్రథమ బహుమతిగా ఫ్రిజ్జు గెలుచుకున్నారు. శుక్రవారం రాత్రి ఈ పోటీలు కాంద్రేగుల ధర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పోటీలో ఉత్సాహంగా పాల్గొని ఆకర్షణీయంగా రంగవల్లులు తీర్చిదిద్దారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ బహుమతిని అందజేశారు. కంచిపాటి సత్యవేణి ద్వితీయ స్థానం పొంది వాషింగ్ మెషిన్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా భరత్ బాబును వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఘనంగా సత్కరించారు. మహిళలు ప్రదర్శించిన కోలాటాలు, భరతనాట్యం ఆహూతులను ఆకట్టుకున్నాయి. వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు పోతురాజుబాబు ఉత్సవం

కశింకోట: మండలంలోని తీడలో ఆదివారం కల్యాణం పోతురాజుబాబు ఉత్సవం జరగనుంది. ఏటా మహాశివరాత్రి తర్వాత ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాన్ని పురస్కరించుకు గ్రామ పెద్దలను కర్రతో తయారు చేసిన గుర్రాలు,ఏనుగుల బొమ్మలపై గ్రామం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళతారు. అనంతరం అక్కడ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తీర్థ మహోత్సవం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఉరుసు


చింతలపాలెంలో హజ్రత్ కాలేషావలీ బాబా దర్గాలో సమాధికి ప్రార్థనలు

కశింకోట:మండలంలోని చింతలపాలెంలో హజ్రత్ కాలేషా వలీ బాబా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చందనాన్ని చింతలపాలెంతోపాటు నసింగబిల్లి, జెట్టపురెడ్డితుని గ్రామాల్లో ఊరేగించారు. అనంతరం దర్గాలో కాలేషా బాబా సమాధికి చందనాన్ని పూసి చాదర్లు కప్పి ప్రార్థనలు చేశారు. ముస్లింతోపాటు హిందూవులు కూడా ఐక్యంగా ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని జరిపారు.